క్లుప్తంగా

టి.నరసాపురం ఎంపీడీవోగా మంగా కుమారి


ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన మంగాకుమారి

టి.నరసాపురం : టి.నరసాపురం ఎంపీడీవోగా బీఎస్ఎల్ మంగా కుమారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. పాలకొల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏఓగా బాధ్యతలు నిర్వహించిన ఆమె పదోన్నతిపై ఇక్కడకు బదిలీపై వచ్చారు. కాగా ఇప్పటివరకు ఎంపీడీవోగా పనిచేసిన ఎస్టీ స్వామి దెందులూరు మండలం బదిలీపై వెళ్లారు.

వైభవంగా మార్కండేయ స్వామి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో విశేష అలంకరణలో మార్కండేయ స్వామి ఉత్సవ మూర్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దక్షిణపు వీధిలోని మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నిత్య హోమం బలిహరణ, అనంతరం ఆలయంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారికి క్షీరాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నిత్య హోమాలు, బలిహరణ పూజలు, అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేసి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కందుకూరి కన్నబాబు విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి డీ. శంకర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ముగిసిన విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

స్థానిక పవర్ పేటలోని శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఆదివారంనాటితో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో ఉదయం వసంతోత్సవం, కొట్నాలు, చూర్ణోత్సవం, త్రిశూల స్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి స్వామి వారికి శ్రీ పుష్ప శయనోత్సవం (పవళింపే సేవ) నిర్వహించారు. ఆలయ అర్చకులు కందుకూరి రామ బ్రహ్మానంద శర్మ విశేష పూజలు చేయగా కార్య నిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఏలూరు చేరుకున్న తిరుమల పాదయాత్రికులు


ఏలూరు చేరుకున్న భోగి గణపతి పీఠం ప్రతినిధి రమణ రాజు, గోవింద స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కాకినాడకు చెందిన శ్రీ భోగి గణపతి పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణ రాజు ఆధ్వర్యంలో కాకినాడ నుంచి తిరుమల వరకూ చేపట్టిన పాద యాత్ర ఆదివారం ఏలూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా రమణ రాజు మాట్లాడుతూ 2008వ సంవత్సరంలో భోగి మంటల్లో వెలసిన స్వయంభూ భోగి గణపతి విగ్రహానికి సంపూర్ణ కాంస్య కవచ ధారణ యజ్ఞం చేపట్టామన్నారు. ఈ యజ్ఞం విజయవంతంగా పూర్తి కావాలనే ఆశయంతో తిరుమలకు 41 రోజుల పాద యాత్ర చేపట్టామన్నారు. ఈ యాత్ర అనంతరం కాకినాడ భోగిగణపతి పీఠంలో 9 రోజులపాటు నిత్య అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. రమణరాజు వెంట గోవింద స్వామి యాత్రలో పాల్గొంటున్నారు.

గంగాధర్ కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ


సర్పంచ్ మధులతను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు

దెందులూరు: వైఎస్సార్ సీపీ నేత, సర్వశిక్షాభియాన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఇంటేటి గంగాధర్ ఆకస్మిక మరణం తమను కలిచివేసిందని మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ డాక్టర్ పండుల రవీంద్ర బాబు అన్నారు. ఆదివారం కొవ్వలిలో గంగాధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సతీమణి సర్పంచ్ మధులతను కుమారులను కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. మీ కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని సూచించారు. గంగాధర్ సేవలను ఎమ్మెల్సీ కొనియాడారు. దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల పార్టీ ప్రెసిడెంట్ కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, నాయకులు బూసి ఎఫ్రాయమ్, గోరిపర్తి రంగారావు, గొల్ల వీరాస్వామి, గొల్ల కిరణ్, తపన సంస్థ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి, వివిధ శాఖల ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు.

వైభవంగా గంగానమ్మ జాతర

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామ దేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతరకు భక్తులు పోటెత్తారు. పక్షం రోజులపాటు నిర్వహించిన జాతర ఉత్సవాలలో ఆదివారం ముగింపు రోజున భక్తులు అమ్మవారికి మహా నివేదన సమర్పించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దాదాపు 45 సంవత్సరాల తరువాత గ్రామంలో జాతర నిర్వహించడంతో దాదాపు 50 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. దీంతో గ్రామంలో రహదారులు కిక్కిరిసాయి. గ్రామానికి నలువైపులా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి ఆర్టీసీ బస్సులు మినహా మిగిలిన నాలుగు చక్రాల వాహనాల రాకపోకలపై పోలీసులు నిషేధ ఆజ్ఞలు విధించారు. సీఐ బి వెంకటేశ్వరరావు, కొయ్యలగూడెం ఎస్సై జీజే విష్ణువర్ధన్, కుక్కునూరు, జీలుగుమిల్లి ఎస్సైలు వి.శ్రీనివాస్, వి.చంద్రశేఖర్, యాభై మందికి పైగా సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. హైవేపై వన్‌వే నిబంధనలను అమలు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులు ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించారు. 15 రోజులపాటు నిర్వహించిన జాతర ఉత్సవాలలో ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా అమ్మవారి జాతర సంప్రదాయ ప్రకారం ప్రశాంతంగా నిర్వహించుకోవడంతో పొంగుటూరు ప్రజానీకాన్ని, పోలీసులను, జాతర కమిటీ నిర్వాహకులను ఎమ్మెల్యేలు అభినందించారు. కుల మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా జాతరలో ప్రజలు పాల్గొనేటట్లు చేసిన నిర్వాహకులను వారు ప్రశంసించారు. జాతరలో భక్తులతో పాటు పోలవరం, చింతలపూడి, గోపాలపురం నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


గంగానమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


అమ్మవారిని దర్శించుకున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

మద్ది అంజన్న సన్నిధిలో..


అప్పారావుకు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని జబర్దస్త్ అప్పారావు దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ సిబ్బంది అప్పారావుకి శేషవస్త్రాన్ని కప్పి సత్కరించారు. అర్చకులు ఆశీర్వచనాలు అందజేసి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. మద్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయ పాత్రపై అవగాహన

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆధునిక సమాజంలో పౌర గ్రంథాలయ పాత్ర అనే అంశంపై విద్యార్థులకు గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప ఆదివారం అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. స్వాతంత్ర్యం సాధించాలనే కాంక్ష రగిలించడంలోను, సామాజిక దురాచారాలు రూపుమాపి, రాత్రి బడుల ద్వారా విద్యా బోధనకు కేంద్రాలుగా గ్రంథాలయాలు వేదికలయ్యాయని ఈ సందర్భంగా బంగారు పాప తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, పాఠకులు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెంలో...

లింగపాలెం : ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణా తరగతులు ఆదివారం 28వ రోజుకు చేరుకున్నాయి. ఉపాధ్యాయులు ఏవీ నారాయణ, రమణ, కుమారి విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు నీతి పద్యాలు నేర్పించటం, జనరల్ నాలెడ్జ్, డ్రాయింగ్, పుస్తక సమీక్ష, చదరంగంలో మెళకువలు నేర్పించడం చేశారు. విద్యార్థులచే మైండ్ మెమరీ గేమ్స్ ఆడించినట్లు గ్రంథాలయాధికారిణి సీహెచ్‌వీ రమణ తెలిపారు.


ద్వారకాతిరుమలలో గ్రంథాలయ పాత్రపై అవగాహన కల్పిస్తున్న బంగారు పాప


ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న రమణ

ఉచిత వైద్యసేవలు అభినందనీయం


వైద్యసేవలు అందించిన వైద్యులను సన్మానించిన దృశ్యం

బుట్టాయగూడెం : గిరిజన ప్రాంతంలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎస్సై ఎం.జయబాబు అన్నారు. స్థానిక విద్యారోహిణి డిజిటల్ స్కూల్‌లో ఆదివారం బుట్టాయగూడెం లయన్స్ క్లబ్, జంగారెడ్డిగూడెం నిర్మలా మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎస్సై జయబాబు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు లయన్స్ క్లబ్ మరిన్ని సేవలు అందించాలని కోరారు. ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పంతగాని వెంకన్న మాట్లాడుతూ వైద్య సేవలు అందించేందుకు నిర్మలా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ముందుకు రావడం అభినందనీయమన్నారు. బుట్టాయగూడెం మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నూపా మధు సూదన్‌బాబు మాట్లాడుతూ ప్రతి నెలా మారుమూల గిరిజన గ్రామాల్లో గిరిపుత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. కాగా ఈ శిబిరంలో వైద్యసేవలందించిన నిర్మలా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి జనరల్ సర్జన్ ఎస్.బిందు ఫిలిఫ్, ఏఓ అర్చన, వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, విజయలక్ష్మి, సత్యసాగర్, వరప్రసాద్ తదితరులను లయన్స్ క్లబ్ ప్రతినిధులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అలాగే విద్యారోహిణీ డిజిటల్ స్కూల్ ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణను సన్మానించారు. అధిక సంఖ్యలో ప్రజలు ఈ శిబిరంలో పాల్గొని వైద్యసేవలు పొందారు. కార్యక్రమంలో మండల లయన్స్ క్లబ్ కార్యదర్శి జాదం శివరామకృష్ణ, సభ్యులు మేరుగ సునీల్‌కుమార్, బోయిన వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఏరువాక పున్నమి వేడుకలు


ఏరువాక పున్నమి వేడుకలు నిర్వహించిన దృశ్యం

చింతలపూడి : మండలంలోని ఎండపల్లి, రేచర్ల గ్రామాల్లో జేడీ ఫౌండేషన్, ,అబ్దుల్ కలాం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏరువాక పున్నమి వేడుకల్లో భాగంగా రైతు పూజోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాడెద్దులకు నాగలికి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అబ్దుల్ కలాం యూత్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరికంటి గోపాలకృష్ణ మాట్లాడుతూ వర్ష ఋతువులో జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమను తెలుగు రైతులు ఏరువాక పున్నమిగా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. తొలకరి జల్లుల ఆగమనంతో రైతుల ఆనందోత్సాహాల మధ్య అరక దున్నటంతో పొలం పనులు మొదలుపెడతారన్నారు. ఏరు అంటే దున్నడానికి సిద్ధం చేసిన నాగలి అని, ఏరువాక అంటే దున్నడానికి ప్రారంభమన్నారు. యువ రైతు గోపాలకృష్ణ మాట్లాడుతూ రైతులందరూ తినడానికి దేశీయ వరి విత్తనాలతో ఎరువులు పురుగు మందులు లేని ఆహారం పండించాలని, ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలన్నారు. రేచర్ల గ్రామ సర్పంచ్ శివ రామకృష్ణ మాట్లాడుతూ నాగరికత ఎంత ముందుకు సాగినా నాగలి కదలనిదే ఆ నాగరికతకు పరమార్థం ఉండదన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గత నాలుగేళ్లగా ఏరువాక పండుగను సంప్రదాయ రీతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 15 మంది ఉత్తమ రైతులకు నూతన వస్త్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు శ్రీహరి, జల్లెళ్ళ కుమారస్వామి, రవి, రైతులు పాల్గొన్నారు.

వరి, ఆయిల్‌పామ్ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి


మాట్లాడుతున్న దంతా కృష్ణ

చింతలపూడి : కౌలు రైతు సంఘం జిల్లా మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించినట్లు జిల్లా కార్యదర్శి దంతా కృష్ణ తెలిపారు. చింతలపూడిలో ఆదివారం జరిగిన సమావేశంలో కృష్ణ మాట్లాడుతూ వరి పంటకు క్వింటాకు రూ.3500 మద్దతు ధర కల్పించాలని, ఆయిల్‌పామ్ పంటకు టన్నుకు రూ.20 వేల గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం వెంటనే పునః ప్రారంభం చేయాలని, ఎకరాకు రూ.40 లక్షలు నిర్వాసితులకు ఇవ్వాలని, గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసితులకు ఎకరాకు రూ.40 లక్షల నష్టపరిహారం ఇచ్చి సర్వీస్ రోడ్లు వేయాలన్నారు. గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని దంతా కృష్ణ కోరారు. కౌలు రైతులకు రూ.వెయ్యి కోట్లతో రక్షణ నిధి ఏర్పాటు చేయాలన్నారు. రూ.రెండు లక్షల వరకు రైతులకు పంట రుణాలు రద్దు చేయాలని, మల్లాయగూడెం శివారు ఆరు గ్రామాల వ్యవసాయ భూములకు చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించి సస్యశ్యామలం చేయాలన్నారు. వెంకటాద్రిగూడెం నుంచి ఎర్రచెరువు వరకు లింకు చెరువులు 19 ఉన్నాయని వాటికి చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించాలని సమాశంలో తీర్మానించినట్లు తెలిపారు. అనంతరం 11 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా గన్ను వెంకటరావు, ఉపాధ్యక్షుడిగా గుంటుముక్కల సతీష్, ప్రధాన కార్యదర్శిగా దొంత కృష్ణ సహాయ కార్యదర్శిగా నాగేంద్రరావు, కోశాధికారిగా రావెళ్ల రాజేశ్వరరావు, కమిటీ సభ్యులుగా తక్కెలపాటి ప్రసాద్, జిల్లెల్ల కృష్ణ, కేరళ వెంకటేశ్వర రావు, పుచ్చకాయల రామచంద్రారెడ్డి, కుప్పాల నాగేశ్వరరావు, గౌరు శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉచిత కుట్టుమెషీన్ శిక్షణా కేంద్రం ప్రారంభం


కుట్టుమెషీన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీరాములు

టి.నరసాపురం : మహిళలు స్వయం ఉపాధికి ఉచిత కుట్టుమెషీన్ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని తపన ఫౌండేషన్ ప్రతినిధి శివగణేష్ తెలిపారు. మండలంలోని ఏపిగుంట పంచాయతీ శ్రీరామవరం గ్రామంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమెషీన్ శిక్షణా కేంద్రాన్ని కాల్నీడి శ్రీరాములు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శివగణేష్ మాట్లాడుతూ ఈ శిక్షణా కేంద్రంలో మూడు నెలల పాటు మహిళలకు శిక్షణ నిర్వహిస్తామన్నారు. ఇప్పటివరకు బుట్టాయిగూడెం, కామవరపుకోట, మక్కినవారిగూడెం గ్రామాల్లో కుట్టుమెషీన్ శిక్షణ కేంద్రాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ యువమోర్చా నాయకులు జట్ల రాంబాబు, అడప వెంకట్రావు, శ్యాంసుందర్, లక్ష్మీపతి, బందారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో మృతులకు నివాళి


మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

కొయ్యలగూడెం : ఒడిస్సా రాష్ట్రంలో రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మ శాంతికై ఆదివారం కొయ్యలగూడెం వాకర్స్ క్లబ్ సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలను ప్రభుత్వం తగిన రీతిలో ఆదుకోవాలని, పెను విపత్తుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలు ధైర్యంతో ఉండాలని అన్నారు. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద సంస్థ ఇండియన్ రైల్వేకి ఇటువంటి ప్రమాదాలు మచ్చను తీసుకువస్తాయని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో దానిని అందిపుచ్చుకునే విధంగా పరిణితి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి మృతులకు నివాళులు అర్పించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు


ఏలూరు రూరల్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, చిత్రంలో సీఐ ఆదిప్రసాద్

ఏలూరు టౌన్: ఏలూరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకే పెద్దపీట వేస్తామని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు చెప్పారు. ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కేసుల నమోదు, పెండింగ్ కేసులు, దర్యాప్తు తదితర విషయాలపై ఆరా తీశారు. రూరల్ స్టేషన్ ఆవరణలోని అయా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతగా, మర్యాదగా నడచుకోవాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. కేసుల దర్యాప్తు, కోర్టుల్లో ఛార్జిషీటు దాఖలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాధితులకు న్యాయం చేసే దిశగా చర్యలు ఉండాలని డీఎస్పీ సూచించారు. ఈ తనిఖీల్లో ఏలూరు వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్, రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మణబాబు ఉన్నారు.

పేకాట, కోడిపందేలపై దాడి

పెదవేగి : రెండు వేర్వేరు ప్రాంతాల్లో పేకాట, కోడిపందేల స్థావరాలపై పోలీసులు మెరుపు దాడి చేశారు. ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కొప్పాకలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా, ఘటనా ప్రదేశంలో నలుగురు వ్యక్తులు వారి వద్ద నుంచి రూ. 2,950 నగదు, 4 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. అనంతరం కూచింపూడిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా, ఇద్దరి నుంచి రూ.2,400 నగదు, ఒక కోడిపుంజు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రహదారులన్నీ అభివృద్ధి చేశాం

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి సహాయ సహకారాలతో దెందులూరు నియోజకవర్గంలో రోడ్లు అభివృద్ధి చేశామని తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎక్కడ రోడ్లు వేయించారో ప్రజలు తెలుసునని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. దెందులూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొలి అజెండా ప్రజల సంక్షేమం, అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన లక్ష్యాలుగా పనిచేస్తోందన్నారు. దెందులూరు నియోజకవర్గంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం రోడ్డు, ఏలూరు, చింతలపూడి రోడ్డు రూ. 29 కోట్లు, ఏలూరు, కైకలూరు రూ. 55 కోట్లు, పెదపాడు, పెరికిడు రూ.27 కోట్లు, దెందులూరు, పంగిడిగూడెం, కొప్పాక, వట్లూరు, విజయరాయి, పెదవేగి, వంగూరు, కవ్వగుంట, జానంపేట, 7వ మైలు, తాళ్లగోకవరం, బాదరాల, రామశింగవరం, గోపన్నపాలెం, రామశింగవరం రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలో ఉండే ప్రజలకు ఎవరు రోడ్లు వేశారో తెలుసునని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. వాస్తవానికి రోడ్ల నిర్మాణ పనులు దెందులూరు నియోజకవర్గంలో ఇలా ఉంటే.. వాటిని ప్రస్తావించకుండా నియోజకవర్గంలో రోడ్లు బాగాలేదంటూ ఎల్లో మీడియా, టీడీపీ నేతలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. మరోసారి దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం ఖాయమని ఎమ్మెల్యేగా తన విజయం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు

దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది వానలు పడి, పంటలు సమృద్ధిగా పంటలు పండి రైతులు సిరిసంపదలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

అందుబాటులో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలోని రైతులకు 90 శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నట్లు ఏఓ బి. సుమలత తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు 280 క్వింటాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం ఆధార్ కార్డు జిరాక్స్‌లను వెంట తీసుకుని ఆర్‌బీకేల్లో సంప్రదించాలని ఆమె కోరారు.

కొయ్యలగూడెం ఎంపీడీవోగా బేబీ శ్రీలక్ష్మి


జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మిని కలిసిన ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం ఎంపీడీవోగా ఆర్.బేబీ శ్రీలక్ష్మి నియమితులయ్యారు. గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కొయ్యలగూడెం ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. సోమవారం చార్జి తీసుకోనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే బాలరాజును, ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మీలను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తానని ఆమె ఈ సందర్భంగా విలేకరులకు తెలిపారు. కాగా ఇప్పటివరకు ఎంపీడీవోగా విధులు నిర్వహించిన కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ జీలుగుమిల్లి బదిలీ అయ్యారు.

ధ్యానంతో మానసిక బలం


పిరమిడ్ మాస్టర్ ప్రసాదరావును సన్మానిస్తున్న ధ్యానులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ధ్యానంతో మానసిక బలం పెరుగుతుందని, ప్రతీ వ్యక్తి తన వయసు ఎంతో అన్ని నిమిషాలు ధ్యానం చేయాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎర్నేని ప్రసాదరావు తెలిపారు. నగరానికి చెందిన పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక సత్రంపాడులో ధ్యానం తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ధ్యానం అంటే శ్వాసమీద ధ్యాస అని, మనలోని అన్ని ఆలోచనలను వీడి శ్వాసమీదే దృష్టి కేంద్రీకరించడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే అన్ని సవాళ్లను ఎదుర్కొనే అత్యద్భుత ఆయుధం ధ్యానం అన్నారు. ఈ సందర్భంగా ధ్యానులు ప్రసాద రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజేటి శేషగిరి రావు, కూర్మాల లక్ష్మి, కొల్లి త్రినాథ్, కొండాల మౌర్య తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి


స్థానిక కోటదిబ్బలోని కల్యాణ మండపంలో మాట్లాడుతున్న బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గారపాటి చౌదరి

ఏలూరు (టూటౌన్): ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ఏలూరు కోటదిబ్బ ప్రాంతంలోని నేరెళ్లరాజా కల్యాణ మండపంలో సోషల్ మీడియా ప్రభావితం చేసే వ్యక్తుల ప్రత్యేక సమావేశం ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దేశంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోదావరి జోనల్ సోషల్ మీడియా కన్వీనర్ గాదిరాజు రామరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొరశ్ళ సుధాకర్ కృష్ణ, బీజేపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తోట వరప్రసాద్, కోటప్రోలు కృష్ణ పాల్గొన్నారు.